ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 3

సోమవారం 21 జూలై 2025



కోటకొండ సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

సాగుకు సన్నద్ధం

- ముందుగానే తెలుగుగంగ ప్రధాన కాలువకు చేరిన కృష్ణాజలాలు
- వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెకుల నీటి విడుదల
- సుమారు 40 చెరువులకు నీరు
- జిల్లాలో టీజీపీ కింద 1,14,500 ఎకరాల ఆయకట్టు
- మెట్ట భూముల్లోని పైర్లకు ప్రాణం పోసిన టీజీపీ నీరు
- ఆనందంలో అన్నదాతలు

రుద్రవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముందస్తు వర్షాలు కురియడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు పుష్కలంగా నీరు చేరింది. పోతిరెడ్డిపాడు నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నీరు నింపారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి కృష్ణాజలాలు తెలుగుగంగ ప్రధాన కాలువకు విడుదల చేశారు. ఈ ఖరీఫ్‌లో ముందస్తు సాగునీటి విడుదల కావడంతో రైతులు, రైతు కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో టీజీపీ ఆయకట్టు కింద 1,14,500 ఎకరాలు

జిల్లా వరి పంటల సాగుకు పెట్టింది పేరు. ఈ జిల్లాలో అధిక శాతం వరి పంటను రైతులు సాగు చేస్తారు. కృష్ణాజలాలు తెలుగుగంగ ఆయకట్టుకు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో తెలుగుగంగ ప్రధాన కాలువ కింద వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది, నంద్యాల, శిరివెళ్ల, గోస్పాడు, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల పరిధిలో 39 బ్లాక్ చానెళ్లు ఉన్నాయి. వాటి కింద 1,14,500 ఎకరాలు ఆయకట్టు భూములున్నాయి. సుమారు 25వేల నుంచి 30వేల వరకు చెరువుల కింద ఆయకట్టు భూములు ఉన్నాయి. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయన్ నుంచి తెలుగు గంగ ప్రధాన కాలువ(చెన్నై కాలువ)కు 5వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. గత సంవర్సరంలో ఆగస్టు 2వ తేది నీటిని వదిలారు. అయితే జూలై 15న ముందుగానే వదలడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

40 చెరువులకు గంగ నీరు

జిల్లాలో సుమారు 40 చెరువులకు గంగ బ్లాక్ చానెళ్ల అనుసంధానంగా ఉండడంతో చెరువులకు నీరు చేరుతోంది. రుద్రవరం మండలంలో రంగారెడ్డి చెరువు, పెదరాజచెరువు, చినరాజచెరువు, మాచినేనిపల్లె రెండు చెరువులు, బి.నాగిరెడ్డిపల్లె సోమయాజులపల్లె చెరువు, టి.లింగందిన్నె, తువ్వపల్లె చెరువులకు గంగ నీరు చేరుతోంది.

వరినారును సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు

ముందస్తుగా సాగునీరు అందడంతో రైతులు చెరువు ఆయకట్టు భూముల్లో, గంగ ఆయకట్టు భూముల్లో వరినారు మళ్లు సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. పంట పొలాల్లో రైతులు, రైతు కూలీలలో సందడి నెలకొంది. విత్తనం వరి ధాన్యం కోసం రైతులు పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేసి తీసుకువచ్చి విత్తనాలు చల్లుకునేందుకు నారుమళ్లు సిద్ధం చేశారు. 25 కేజీల ప్యాకెట్ వరి ధాన్యం విత్తనం రూ.వెయ్యి చొప్పున కొనుగోలు చేశారు. మరికొందరు రైతులు ట్రాక్టర్లతో ఆయకట్టు భూములను నాట్లు వేసేందుకు సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. ఎక్కడ చూసినా కృష్ణాజలాలు కాలువల వెంట గలగల పారుతోంది. కృష్ణాజలాల రాకతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



రుద్రవరంలో చెరువు ఆయకట్టు భూముల్లో వరి విత్తనాలు చల్లుతున్న రైతు

మెట్టభూముల్లోని పంటలకూ ప్రాణం



చిన్నరాజు చెరువు

మెట్టభూముల్లో రైతులు మొక్కజొన్న, మినుము, వేరుశనగ పంటలు సాగు చేశారు. తెలుగుగంగ జలాలు మెట్ట భూములకు కూడా సాగునీరందించి ప్రాణం పోశాయి. మొన్నటి వరకు వర్షాల కోసం ఎదురు చూశారు. తెలుగుగంగకు సాగునీరు విడుదల చేయడంతో పంటలకు ఎప్పుడైనా సాగునీరు పారించి దక్కించుకుంటామని రైతులు ధీమాగా ఉన్నారు.

చెరువులకు నీటి విడుదల

తెలుగుగంగ జలాలను తుండ్లవాగు రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రాజెక్టు చైర్మన్ సంజీవకుమార్‌రెడ్డి ఈ నెల 18న నీటిని విడుదల చేశారు. తుండ్లవాగు రిజర్వాయరు నుంచి అనుసంధానమైన వాగులు, కాలువలతో ఆళ్లగడ్డ మండలం రుద్రవరం మండలంలోని చెరువులకు వాగులు, వంకల వెంట సాగు చేసిన భూములకు గంగ జలాలు అందనున్నాయి. అలాగే ఆలమూరు, టి.లింగందిన్నె, ముకుందాపురం, యాదవాడ చెరువులకు సాగునీరు చేరుతుంది.

గతేడాది కంటే ముందుగానే..

2024లో ఆగస్టు 2న వెలుగోడు రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాలువకు అధికారులు, ప్రజా ప్రతినిధులు నీటిని విడుదల చేశారు. 2025 జూలై 15న నీటిని విడుదల చేశారు. ముందస్తు సాగునీరు విడుదల చేయడం, కాలువల్లో ప్రవహించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ముందస్తు సాగునీరు అందడంతో పంటలు సాగు చేసేందుకు సౌకర్యంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముందుగానే నీరు రావడం సంతోషకరం



తెలుగుగంగ ప్రధాన కాలువకు ముందుగానే నీరు విడుదల చేయడం సంతోషకరంగా ఉంది. ప్రధాన కాలువ నుంచి బ్లాక్ చానెళ్లకు సాగునీరు ప్రవహిస్తోంది. వర్షం లేకున్నా భయపడాల్సిన అవసరం లేదు. గంగ నీరు ఉందన్న ధీమా ఉంది.

-శివయ్య రైతు, రుద్రవరం

సాగులో నిమగ్నమయ్యాం



తెలుగుగంగ నీరు జూలై మాసంలోనే చెరువులకు అందడంతో సంతోషంగా ఉంది. గతంలో ఆగస్టు మాసంలో తెలుగుగంగ నీరు అందేది. ముందస్తు సాగునీరు అందడంతో పంటలు సాగు చేయడానికి సౌకర్యంగా ఉంది. అటు చెరువు, ఇటు గంగ బ్లాక్ చానెళ్ల కింద వరి పంటను సాగు చేయడంలో నిమగ్నమయ్యాం.

-జమాల్‌సాహెబ్, కొండామయపల్లె, రైతు

పొలాలను సిద్ధం చేస్తున్నాం



చెరువులకు క్రిష్ణాజలాలు చేరాయి. చెరువు కింద ఆయకట్టు భూముల్లో నారను సాగు చేయడంలో నిమగ్నమయ్యాం. ఈ సారి ముందస్తుగానే వరినాట్లు వేస్తాం. పొలాలను ట్రాక్టర్లతో దున్నిస్తున్నాం.

- వాసు రైతు, రుద్రవరం



కొండమాయపల్లెలో ట్రాక్టరుతో పొలాన్ని దున్నుతున్న దృశ్యం

కామేశ్వరీదేవికి పుట్టింటి పట్టు చీర

- మహిళలకు ఘనస్వాగతం పలికిన ఆలయాధికారులు
- ఆకట్టుకున్న కోలాటం, భజనలు



అమ్మవారికి ఆషాఢం చీర, సారె తీసుకెళ్తున్న సేవాసమితి మహిళలు

మహానంది, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి బాలాజీ సేవా ట్రస్ట్‌కు చెందిన వందలాది మంది మహిళలు పుట్టింటి పట్టుచీర కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి క్షేత్ర సమీపంలోని గరుడ నందీశ్వరుడి ఆలయం వద్ద ఆదివారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం సేవా సమితి కి చెందిన మహిళలు శోభ యాత్ర నిర్వహిస్తూ భక్తి పారవశ్యంతో కోలాటం, భజనలు చేస్తూ మాడవీధుల ద్వారా ప్రధాన ఆలయం వద్దకు చేరుకున్నారు. కామేశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆషాఢం సారెగా పట్టువస్త్రాలను ఆలయ అర్చకులకు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మహిళల కోలాటం

తల్లికి వందనం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకానికి అర్హులై.. అనర్హుల జాబితాలో ఉన్న వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని తల్లికి వందనం తిరస్కరిస్తే సంబంధిత ప్రభుత్వ కార్యాలయం డీడీవో నుంచి ఎవరూ ప్రభుత్వ ఉద్యోగం చేయడం లేదని ఓ లెటరు సమర్పించాలని తెలిపారు. ఆదాయ పన్ను చెల్లించడం లేదని, వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు లేదని, పది ఎకరాల కంటే ఎక్కువ భూమి లేదని, కుటుంబంలో ఎవరికీ నాలుగు చక్రాల వాహనం లేదని, 300 యూనిట్లకు మించి కరెంటు వాడటం లేదని తగిన ఆధారాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈవిషయాలను తల్లిదండ్రులు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సీఈవో విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండల, డివిజన్, మున్సిపల్, కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా మండలం, డివిజన్ కార్యాలయాల్లో కూడా అర్జీలను అందజేయవచ్చని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని అర్జీలను మాత్రమే జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌లో ఇవ్వవచ్చని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే పీజీఆర్ఎస్‌కు ప్రతి అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి
- రైతు వ్యతిరేక భూసేకరణ విధానాలపై రాష్ట్ర సదస్సు

నంద్యాల రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రైతన్నల జీవనాధారమైన భూములను బలవంతంగా సేకరించడం ఆపాలని రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నేషనల్ పీజీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక భూసేకరణ విధానాలపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్, గ్రీన్ ఎనర్జీల పేరుతో బలవంతంగా రైతుల వద్ద నుంచి భూములను సేకరించి ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం రైతులకు తీవ్రద్రోహం చేసినట్లేనని ఆరోపించారు. చట్టబద్ధమైన రీతిలో భూసేకరణ చేయకుండా అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లు చేయడం సరికాదన్నారు. రైతు కుటుంబాల భావి జీవితాలకు తీరని విఘాతం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ రైతులు నెత్తిన కత్తిపెట్టి రైతుల నుంచి భూములను లాక్కొని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కౌలు రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల సూర్యారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, పలు జిల్లాలకు చెందిన రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు సరికొత్తగా ఆలోచించాలి

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అభివృద్ధి చెందుతోంది
- ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్
- ఘనంగా కర్నూలు ఐఐఐటీ డీఎం 7వ స్నాతకోత్సవం



కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యం సరి కొత్తగా ఆలోచించాలని ఇస్రో చైర్మన్‌డాక్టర్ వి.నారాయణన్ సూచించారు. కర్నూలు నగరం సమీపంలోని జగన్నాథగట్టుపై ఉన్న భారత సమాచార సాంకేతికత, రూపకల్పన, తయారీ సంస్థ (ఐఐఐటీడీఎం) 7వ స్నాతకోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నారాయణన్ హాజరై ప్రసంగించారు. దేశంలో శాస్త్రీయ అభివృద్ధిని గ్రామీణాభివృద్ధితో అనుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారత్ విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో సాధించిన అసాధారణ విజయాల గురించి ఆయన వివరించారు. 104 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించడం భారత్ సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. సమాచార రంగంలో జరిగిన అభివృద్ధిలో దేశపు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచాయన్నారు. వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో దేశం సాధించిన పురోగతి గురించి వివరించారు. ప్రస్తుతం భారత ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి చేరిందని, మెడికల్ టెక్నాలజీలో విప్లవాత్మక అభివృద్ధి జరుగుతోందని వివరించారు.



ఐఐఐటీడీఎం స్నాతకోత్సవంలో పాల్గొన్న ఇస్రో చైర్మన్

మిగతా 5వ పేజీలో


శ్రీశైలంలో భక్తుల రద్దీ



దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో భక్తులు శ్రీశైలం చేరుకుని పాతాళగంగలో స్నానాలు ఆచరించి స్వామి అమ్మవారి దర్శనార్థం క్యూలైన్లలో భారీగా బారులు తీరారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, అల్పాహారాన్ని అందించారు.

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద



నిండుకుండలా శ్రీశైలం జలాశయం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి స్థిరంగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ఉన్న జూరాల, సుంకేశుల నుంచి జలాశయం నుంచి 1,56,516 క్యూసెక్కుల వరద శ్రీశైలం చేరుకుంటోంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలకు 87,525 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.50 అడుగులకు చేరింది.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

- ఘనస్వాగతం పలికిన మఠం అధికారులు

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీషానంద ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద ఈయనకు మఠం మేనేజర్లు ఎస్.కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘన స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట ఎస్ఐ శివాంజల్, జేపీస్వామి, స్వామిరాయ్, జయతీర్థఆచార్, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వచ్చి వెళ్తూ...

- ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు యువకుల గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు
- నలుగురిని కాపాడిన వ్యవసాయ కూలీలు

5

బుగ్గరామేశ్వరస్వామీ.. ఏమిటీ దుస్థితి..!

గుబాళించని కుసుమాలు

- తెగుళ్లతో దెబ్బతిన్న పూల తోటలు
- గిట్టుబాటు కాని ధరలు
- ఆందోళనలో అన్నదాతలు



చాగలమర్రిలో మల్లెపూలు కోస్తున్న కూలీలు

చాగలమర్రి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పూల తోటలు సాగుచేసిన రైతులకు అడుగడుగునా అవాంతరాలు తప్పడం లేదు. ఓ వైపు తెగుళ్ల బెడద.. మరో వైపు గిట్టుబాటు కాని ధరలతో పూల రైతులు పాట్లు పడుతున్నారు. చాగలమర్రి మండలం పూల సాగుకు పెట్టింది పేరు. 1,000 ఎకరాల్లో మల్లె పూల తోటలు, 500 ఎకరాల్లో సన్నజాజి తోటలు సాగు చేస్తారు. వీటిని పలు మార్కెట్లకు విక్రయిస్తారు. ఇక్కడి నుంచి హైదరాబాదు, కర్నూలు, తిరుపతికి తరలిస్తారు. అధిక విస్తీర్ణంలో ఆయా గ్రామాల్లో మల్లె తోటలు సాగు చేశారు. పూల సాగుచేసే రైతులు ఎక్కువగా పండుగల సమయంలో లాభాలు గడిస్తారు.

తెల్లదోమ, ఎర్రదోమ..

ప్రస్తుతం తోటల్లో తెల్లదోమ, ఎర్రదోమ లాంటి తెగుళ్ల ఆశిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్లతో మల్లెతోటల్లో ఎర్ర మొగ్గ ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపుతోంది. వీటి నివారణకు పలుమార్లు మందులు పిచికారి చేస్తున్నా నియంత్రణ కావడం లేదని వారు దిగాలు చెందుతున్నారు. పంట దిగుబడి చేతికందాలంటే ఆరు విడతలుగా పిచికారి చేయాల్సి వస్తుంటున్నారు. దీనికి రూ.15 వేలు దాకా ఖర్చు వస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అందిన పూల దిగుబడి మార్కెట్‌లో విక్రయాలతో సరి చూసుకుంటే లాభాలు ఆశా జనకంగా లేవని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోల చొప్పున సీజన్ బట్టి మల్లెల ధర రూ.170, జాజి పూలు కిలో రూ.150 పలుకుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో ధర పర్వాలేదనిపించిన జూన్‌లో ధర అమాంతంగా పడిపోయింది. కేవలం నెలన్నర వ్యవధిలోనే కిలో మల్లెలు రూ.300 నుంచి రూ.120 ధర పడిపోయింది. సన్న జాజులు కిలో 300 నుంచి రూ.170 పడిపోవడంతో రైతులు నష్టాల పాలయ్యారు. పూలను కోసే కూలీలకు కూలి ఇవ్వలేక రైతులు తోటల్లోనే పూలను వదిలేస్తున్నారు. కొందరు జీవాలకు మేతగా విడిచిపెట్టారు. మరి కొందరు పూల తోటలను దున్నేసి ప్రత్యామ్నాయ పంటపై దృష్టి పెట్టారు. ఈ ఏడాది దిగుబడి లేక రైతులు నష్టాల పాలవుతున్నారు. ప్రభుత్వం మల్లె తోటలకు రాయితీలు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



రెండెకరాల్లో జాజిపూలు..



రెండెకరాల్లో జాజిపూలు సాగు చేశా. గుత్త రూ.2లక్షలు గత నెలలో కేజీ రూ.150 ధర పలికింది. ప్రస్తుతం ధరలేక నష్టాలు వచ్చాయి. పూలు ధర రూ.150 పోతే కూలీలకు కూడా సరిపోవు. గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

● ఫకృద్దీన్, కౌలు రైతు, చాగలమర్రి

ప్రిన్సిపాల్‌కు నేషనల్ అవార్డు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గ్లోబల్ సంస్థ కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్‌కు రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డు ఫర్ ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్ అవార్డు అందజేసింది. ఈ అవార్డును ఈమెయిల్ ద్వారా ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌కు అందజేశారు. విద్యారంగంలో సమకాలిన మార్పులకు అనుగుణంగా సమిళిత దృక్పథంతో వినూత్నమైన పద్ధతులను రూపకల్పన చేయడంలో విశేషమైన సేవలందించినందుకు గానూ ఈ అవార్డులను సంస్థ ప్రదానం చేసింది. మార్చి 2025లో జరిగిన ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో కళాశాలలో విద్యార్థులు 82.02 శాతం ఉత్తీర్ణతతోనూ, 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక అడ్మిషన్లు పొందడానికి విశేష కృషి చేసినందుకు గానూ కళాశాల ప్రిన్సిపాల్‌ను టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అవార్డును అందుకున్నందుకు ప్రిన్సిపాల్‌ను బోధన, బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వడం అభినందనీయం

● బలిజ సంఘం, 'రోపా' నాయకులు


సన్మానిస్తున్న రోపా, బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బలిజలకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని కర్నూలు జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు కోనేటి చంద్రబాబు, రాయల్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) అధ్యక్షుడు చింతలపల్లి రామకృష్ణ, జనరల్ సెక్రటరీ కోనేటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రోపా ఆధ్వర్యంలో బలిజల ఆత్మీయ సమావేశం నగరంలోని డీవీఆర్ హోటల్‌లో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న మైలేరీ మల్లయ్య సతీమణి మైలేరి సురేఖకు, ఉలిందకొండ సింగిల్ విండో నూతన చైర్మన్ యుద్ధం వెంకటరమణను ఘనంగా సన్మానించారు. ఎంపికకు సహకరించిన ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియకు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి బలిజ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. జనసేన నాయకులు చింతా సురేష్, జావాజీ రేఖ, పసుపుల పవన్ కుమార్, కొణిదెల శ్రీనివాస్, పూజల రాము, కొండా విజయ్, కర్నూలు జిల్లా బలిజ సంఘం, రోపా సభ్యులు కొట్టె చెన్నయ్య, బీపీ శ్రీనివాసరావు, దంతెల రమణ, యుద్ధం శ్రీకాంత్, తుళువ గోపాల్, రామనాథ్, బాలరాజు, సుబ్రహ్మణ్యం, బత్తుల గంగాధర్, కామినేని వెంకటేశ్వర్లు, గన్నపురెడ్డి శ్రీనివాస్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వచ్చి వెళ్తూ...

● ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన కారు ● ఇద్దరు యువకుల గల్లంతు ● ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు ● నలుగురిని కాపాడిన వ్యవసాయ కూలీలు

ఆరుగురు యువకులు మంచి స్నేహితులు. కర్ణాటక రాష్ట్రం దార్వాడ జిల్లా హుబ్లీ దగ్గర ఓ కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శని, ఆదివారాలు సెలవుకావడంతో రాఘవేంద్రస్వామి దర్శించుకునేందుకు కారులో వచ్చారు. స్వామివారిని దర్శించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. కొప్పల్ దగ్గర ఉన్న గవిమఠాన్ని సందర్శించుకోవాలని అనుకున్నారు. వారు వెళ్తున్న కారు అతివేగంగా కౌతాళం సమీపంలో ఎల్లెల్సీ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు గల్లంతు అయ్యారు. కాగా వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో నలుగురు యువకులను కాలువగట్టుపై భోజనాలు చేస్తున్న రైతు కూలీలు సురక్షితంగా కాపాడారు. కాగా ప్రమాదానికి అతివేగమే కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.


ఎల్లెల్సీ కాలువలో నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం


సునీల్ మృతదేహం

కౌతాళం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చి వెళ్తూ ఓ కారు అతివేగంతో ఎల్లెల్సీలోకి దూసుకెళ్లింది. ఈ ఘట నలో ఇద్దరు గల్లంతు కాగా ఒకరి మృతదేహం లభించింది. మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కారులో ఉన్న మిగతా నలుగురిని రైతు కూలీలు సురక్షితంగా కాపాడినట్లు కౌతాళం సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం దార్వాడ జిల్లా హుబ్లీలోని ఓ కంపెనీలో సునీల్, మణికంఠ, హైదర్, మంజునాథ్, అప్పయ్య, అభిషేక్ కార్మికులుగా పని చేస్తున్నారు. వీరంతా 25ఏళ్లలోపు యువకులే. మంచి స్నేహితులు. శని, ఆదివారాలు సెలవులు రావడంతో మంత్రాలయానికి రాఘవేంద్రస్వామిని దర్శనార్థం కారులో వచ్చారు. దర్శనం ముగించుకొని ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరారు. కొప్పల దగ్గర ఉన్న గవిమఠం క్షేత్రాన్ని దర్శించుకొని అక్కడి నుంచి హుబ్లీకి రాత్రికంతా చేరుకోవాలనుకున్నారు. అతివేగంతో కారు కౌతాళానికి సమీపంలోని ఎల్లెల్సీ కాలువలోకి దూసుకెళ్లింది. మణికంఠ, సునీల్ (21) కాలువనీటిలో గల్లంత య్యారు. సునీల్ మృతదేహం లభ్యమైంది. మణికంఠ ఆచూకీ కోసం చీకటి పడినా ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ టీం, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగించారు. తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

అప్రమత్తమైన వ్యవసాయ కూలీలు

కౌతాళం మండల టీడీపీ నాయకుడు వెంకటపతిరాజు పొలంలో పనుల కోసం వచ్చిన ఎరిగేరి, లక్ష్మీనగర్ క్యాంపులకు చెందిన వ్యవసాయ కూలీలు గొట్టయ్య, గోవర్ధన్, రమేష్ ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల సమ యంలో ఎల్లెల్సీ కాలువ గట్టుపై భోజనాలు చేస్తున్నారు. ఆసమయంలో కుప్పగల్ నుంచి కౌతాళం వైపు వేగంగా వెళ్తున్న కారు కాలువ లోకి దూ సుకెళ్లింది. గట్టుపై భోజనం చేస్తున్న కూలీలు క్షణాల్లో అప్ర మత్తమయ్యారు. కాలువలో పడిన కారులోని యువకులను కాపా డేం దుకు ముందుకు వచ్చారు. హైదర్, మంజునాథ్, అప్పయ్య, అభిషేక్‌ను సురక్షితంగా కాపాడారు. వీరిలో ఇద్దరికి ఈత వస్తుండడంతో కారులో నుంచి అతి కష్టంమీద బయటకు వస్తుండగా కూలీలు వారిని ఒడ్డున చేర్చి ప్రాణాలను కాపాడారు. అప్పటికే ఇద్దరు యువకులు గల్లంతయ్యా రు.

ఎక్స్‌కవేటర్ సహాయంతో..

ఎల్లెల్సీలోకి కారు దూసుకుపోయిందనే సమాచారం తెలియగానే సీఐ అశోక్‌కుమార్, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే కూలీలు నలుగురు యువకులను కాపాడారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కాలువలోని కారును బయటకు తీశారు. సునీల్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు మిత్రులను కోల్పోవడం ఎంతో బాధగా ఉందని, ఆ రాఘవేంద్రస్వామే మమ్మల్ని కాపాడారని, ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడిన యువకులు పేర్కొన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కొండల నడుమ పచ్చని వృక్షాలు.. సెలయేటి గలగలలు.. పక్షుల కిలకిలరావాలు.. ఆధ్యాత్మికత శోభ.. ఇదీ కాల్వబుగ్గ రామేశ్వరస్వామి క్షేత్రం. శుభాకార్యాలు జరుపుకునేందుకు అనువైన ప్రాంతం కావడంతో శివాలయాన్ని కట్టించారు. భూగర్భజలాలు ఉబికివచ్చే ప్రాంతంలో కోనేర్లను నిర్మించారు. దాదాపు 200 ఏళ్ల క్రితం విషయాలు ఇవి. ఎనిమిదేళ్ల నుంచి పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. చిన్న, పెద్ద కోనేరులు ఒక్కసారిగా ఎండిపోయాయి. అభిషేకానికి సైతం బోరు నీరే వాడాల్సి పరిస్థితి. దీంతో ఇక్కడి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో సైతం దేవదాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.



ఏమిటీ దుస్థితి...?

ఓర్వకల్లు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి క్షేత్రంలో కోనేర్లు ఎండిపోయాయి. ఈ ఆలయంలో ఎన్నడూ లేనివిధంగా నీటిఎద్దడి నెలకొంది. చిన్న కోనేరు, పెద్దకోనేరు నీళ్లతో కళకళలాడిన కాల్వబుగ్గ క్షేత్రం నేడు నీరులేక వెలవెలబోతోంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు సైతం నీరులేక ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యను తీర్చేందుకు చిన్న కోనేటి సమీపంలో రెండు బోర్లు వేసినా వాటిలో కూడా నీరు అంతంత మాత్రమే వస్తుంది. అరకొర నీటినే పైపులైన్ ద్వారా చిన్న కోనేటికి వదులుతున్నారు. ఒకప్పుడు కాల్వబుగ్గ పుష్కలమైన నీటి వనరులు భక్తులను ఆహ్లాదపరచడమే కాకుండా హుశేనాపురం, కాల్వ గ్రామాలకు చెందిన 300 ఎకరాలకు నీటి సౌకర్యం విపరీతంగా ఉండేది. అయితే.. ఏడు గ్రామాలకు తాగునీరు కూడా అందించేది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో ఆపొలాలు బీళ్లుగా మారాయి. వర్షాలు లేక భూగర్భజలాలు ఇంకిపోయాయి. పెద్దకోనేటిలో చుక్కనీరు కూడా లేదు. కోనేటిని చూసిన భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రసిద్ధి చెందిన కాల్వబుగ్గ రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ప్రతి యేటా కొన్ని వందల వివాహాలు జరుగుతాయి. అనేక శుభకార్యాలకు వేదిక, వేల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రం ప్రాభవం కోల్పోయే ప్రమాదాన్ని నెలకొంటుంది. భక్తులకు నీటి కష్టాలను తీర్చేందుకు ప్రత్నామ్నాయ ఏర్పాట్లు అధికారులు చేయలేదు. ఎనిమిదేళ్లుగా వర్షం వస్తేనే కోనేరుల్లో నీరు.. ఎండాకాలమంతా ఒట్టిపోయిన కోనేటిలు దర్శనమిస్తున్నాయి. వీటిపైన దేవదాయశాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే వర్షాకాలంలో భారీ వర్షాలు పడిన సమయంలోనే రెండు కోనేర్లు కొద్ది రోజులు నీటితో కళకళాలాడుతాయి.


ఎండిపోయిన కాల్వ

- శివలింగం అభిషేకానికి బోరు నీరే శరణ్యం
- కాల్వబుగ్గ క్షేత్రంలో ఎండిపోయిన కోనేర్లు
- బోర్లతో చిన్నకోనేరులోకి నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- అప్పట్లో తాగు, సాగునీరు కూడా అందేది
- బీళ్లుగా మారుతున్న పరిసర పొలాలు

నీరులేక వెలవెల



కాల్వబుగ్గ క్షేత్రంలో నీటి బుడగలు ఎండిపోయాయి. గతంలో నీటితో కళకళలాడే కోనేర్లు నీరు లేక వెలవెలబోతున్నాయి. నీటి బుడగలు 300 ఎకరాలకు నీరు అందించేది. ప్రస్తుతం ఎనిమిదేళ్ల నుంచి నీరు కరువైంది. వర్షాలు లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది.

● గొల్ల నాగరాజు, భక్తుడు

ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేయాలి



క్షేత్రంలో నీటి బుడగలు ఇంకిపోయాయి. పుణ్య క్షేత్రం పైన విపరీతంగా బోర్లు వేశారు. వీటితోనే కోనేర్లలోకి నీరు రావడం లేదు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.. ఇప్పటికే దాతల సహకారంతో వాటరు ట్యాంకు ఏర్పాటచేశారు. కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

● కాకి దేవేంద్ర, భక్తుడు

హుశేనాపురం నుంచి కాలినడకన..



గతంలో హుశేనాపురం నుంచి కాలినడకన వెళ్లి కోనేటిలో స్నానాలచరించేవారం. రాను రానూ కాల్వబుగ్గలో నీరు కరువయ్యాయి. భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కోనేరులతో తాగునీరే కాకుండా సాగునీరు కూడా అందేది. కాల్వబుగ్గపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి.

● జీకే సుధాకర్, భక్తుడు

విద్యార్థులు సరికొత్తగా ఆలోచించాలి



ప్రొఫెసర్లు, విద్యార్థులతో ఇస్రో చైర్మన్


3వ పేజీ తరువాయి

సమగ్ర అభివృద్ధి కోసం ఇంజనీరింగ్ విద్యార్థులు తమ జ్ఞానాన్ని గ్రామాభివృద్ధికి మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు మాతృభూమికి సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధ్యాపకులు విద్యార్థుల్లో పరిశోధనా స్ఫూర్తిని, నవీనా ఆలోచనల అభివృద్ధిని పెంపొందించాల్సిన బాధ్యత కలిగి ఉన్నారని తెలిపారు. ఐఐఐటీడీఎం కర్నూలుపై తన ఆశయాలను వెల్లడించిన ఆయన ఈసంస్థ త్వరలోనే దేశంలోనే అగ్రగామి విద్యా, పరిశోధన సంస్థల్లో ఒకటిగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునికీకరణ, పరిశోధనపై భారత్ ప్రత్యేక దృష్టి పెట్టిందని, దీంతో 2047నాటికి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ చైర్‌పర్సన్ దేశ్‌మాని విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచస్థాయి నదుపాయాలను అందించడంలో బోధన, పరిశోధనలలో నవీనతను ప్రోత్సహించడంలో తమ సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. ఐఐఐటీడీఎం విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నారని ఆమె తెలిపారు. ఈ సంస్థను పరిశోధన, వినూత్నతలో కేంద్రంగా అభివృద్ధి చేయడమే తమ దృష్టికోణమని చెప్పారు. డైరెక్టర్ ప్రొ.బీఎస్ మూర్తి మాట్లాడుతూ డిగ్రీ ఒకటే కాదని, దేశానికి అవసరమైన యాక్టివిటీస్, ప్రాజెక్టులు, నాయకత్వ లక్షణాలతో ప్రపంచ స్థాయిలో ఎక్కడైనా రాణించేలా విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గేట్ ప్రవేశ పోటీ పరీక్షలో 200లోపు ర్యాంకులు వచ్చిన వారు కర్నూలు ఐఐఐటీడీఎంలో ప్రవేశాలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే కర్నూలు విద్యాసంస్థ డ్రోన్ టెక్నాలజీలో ముందంజలో ఉందన్నారు. తమ విద్యాసంస్థలో పని చేస్తున్న 44 మంది బోధన అధ్యాపకులు వివిధ పరిశోధనలు విస్తృతంగా పని చేస్తున్నారని అన్నారు. చదువుతో పాటు పరిశోధనల వైపు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్య ఒక్కటే కాదు.. స్పోర్ట్స్ మీట్‌లో 36 మెడల్స్, టోర్నమెంట్స్ మెన్స్ విభాగంలో 49 మెడల్స్ సాధించారన్నారు.

206 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

అనంతరం 206 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఇస్రో చైర్మన్ నారాయణన్‌తో పాటు బోర్డు చైర్‌పర్సన్ విజయలక్ష్మి, డైరెక్టర్ ప్రొ.బీఎస్ మూర్తి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఇందులో 183 మందికి బీటెక్, 19 మందికి ఎంటెక్, నలుగురికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ జీవీఎల్ సోమయాజులు, రిజిస్ట్రార్ గురుమూర్తి, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


పట్టా ప్రదానోత్సవంలో పాల్గొన్న నారాయణన్

తుంగభద్ర నదిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● కాపాడిన మత్స్యకారులు

మంత్రాలయం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన ఆదివారం మధ్యాహ్నం మండలంలో మాధవరం గ్రామ సమీపంలో తుంగభద్రనది బ్రిడ్జి వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఆదోని పట్టణానికి చెందిన బేల్దార్ నాగరాజు (35) ఇంటి వద్ద ఉన్న సమస్యలు కారణంగా మద్యం సేవించి దాదాపు 20 అడుగులు ఎత్తు ఉన్న బ్రిడ్జి పై నుంచి నదిలోకి దూకాడు. అక్కడి నుంచి కిలో మీటరు వరకు వరదలో ఈత కొడుతూ రక్షించాలంటూ కేకలు వేశాడు. మాధవరం వాగు తుంగభద్ర నదిలో కలిసే ఒత్తుమూల వద్ద పుట్టీలతో చేపలు పడుతున్న మాధవరం గ్రామానికి చెందిన మత్స్యకారులు తెలుగు చిన్నన్న, కుల్ల ఏలియా, మద్దిలేటి గమనించారు. ముళ్లకంపలో ఇరుక్కున్న బేల్దార్ నాగరాజును ప్రాణాలు తెగించి కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఆత్మహత్యాయత్నం పాల్పడిన వ్యక్తి ఇచ్చిన సెల్‌నెంబరు ద్వారా ఆదోనిలో ఉన్న బంధువులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన బంధువులు మాధవరం నది వద్దకు వచ్చారు. నాగరాజును కాపాడిన మత్స్యకారులను గ్రామస్థులు, పోలీసులు అభినందించారు.

వ్యక్తి బలవన్మరణం

ఆదోని, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ వ్యక్తి బల వన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నిజాముద్దీన్‌కాలనీలో చోటు చేసుకు న్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని నిజాము ద్దీన్ కాలనీకి చెందిన ఇసాక్46) అనే వ్యక్తి మానసిక స్థితి కొంతకా లంగా సరిగా లేదు. ఆదివారం ఉదయం అతడు ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఖాజీపుర వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కూరగాయల వ్యాపారం చేస్తుండేవాడు. ఆయనకు భార్య షంషున్నీసాతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

ఓర్వకల్లు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గం అభివృద్ధికి ప్రవాసాంధ్రులు సహకరించాలని టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా పెన్సిల్వేనియా రాష్ట్రం చెస్టర్ స్ప్రింగ్స్ నగరంలోని ప్రవాసాంధ్రులతో ఆయన సమావేశమయ్యారు. తానా బోర్డు సభ్యుడు పొట్లూరి రవి నిర్వహించిన ఈ సమావేశంలో ప్రవాసాంధ్రులు గౌరు వెంకటరెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం గౌరు మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాణ్యం నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చేస్తున్నారని, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి నాయకత్వంలో పాణ్యం నియోజకవర్గం హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. ప్రవాసాంధ్రులు తమ నైపుణ్యం, పెట్టుబడులతో ముందుకు వచ్చి పరిశ్రమల అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో అనుమల జగదీష్ రెడ్డి, తానా రీజనల్ కో ఆర్డినేటర్ కంతేటి ఫణి, మురళిరెడ్డి, వీర్నాల బాలాజి, కునారపు ప్రసాద్, తుబాటి హరి, చిక్కాల రవి, కోటి యాగంటి, యలమంచి సురేష్, కొండా లక్ష్మినరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన గౌరు వెంకటరెడ్డికి శంషాబాద్ విమానాశ్రయంలో టీడీపీ నాయ కులు శ్రీరాములు ఘనంగా స్వాగతం పలికారు.

ప్రవాసాంధ్రులను కోరిన గౌరు వెంకటరెడ్డి


గౌరు వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

గోనెగండ్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): దంపతులిద్దరు పురుగుమందు తాగిన ఘటనలో చికిత్సపొందుతూ భార్య మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. గోనెగండ్లలోని కురువ వీధిలో కురువ పెద్ద ఈరన్న, అంజినమ్మ దంపతులు నివసించే వారు. వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భర్త పెద్ద ఈరన్న మద్యానికి బానిసయ్యాడు. భర్త పెట్టే బాధలు భరించలేక ఈ నెల 2వ తేదీన భార్య అంజినమ్మ భర్త ఎదురుగానే పురుగుమందు తా గింది. తన కళ్ల ముందే భార్య పురుగుమందు తాగడంతో వెంటనే మిగిలిన పురుగుమందు ఈరన్న తాగేశాడు. ఇద్దరు స్పృహకోల్పోయారు. గమనించిన కాలనీవాసులు చికిత్సనిమిత్తం ఇద్దరిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మెరుగైన వైద్యసేవల కోసం వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం అంజినమ్మ మృతిచెందింది. మృతురాలి తండ్రి శంకరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

పారని మురుగు

- అస్తవ్యస్తంగా కాల్వల నిర్మాణం
- ఇళ్ల మధ్య నిలిచిన మురుగు
- దోమలకు ఆవాసాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


భూపనపాడులో బురదతో అవస్థలు పడుతున్న గ్రామస్థులు


ఇంటి వద్దే మురుగు

పాణ్యం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మురుగు కాల్వల నిర్మాణం అస్తవ్యస్తంగా మారింది. దీంతో మురుగునీరు ముందుకు పారడం లేదు. కొత్త కాలనీలు ఏర్పాటు సమయంలో మురుగు తరలించే ప్రయత్నాల్లో సాంకేతిక నిపుణులు వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మురుగు ప్రవాహం లేకపోవడంతో దోమలు ఆవాసాలు ఏర్పాటుచేసుకున్నాయి. గ్రామాల్లో సరైన మురుగు పారుదల వ్యవస్థలేక దోమల నియంత్రణ సాధ్యం కావడం లేదు. మూడేళ్ల క్రితం మురుగు కాల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ ఎమ్మెల్యేను కాలనీలోకి రానివ్వకుండా అడ్డుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. కొన్ని గ్రామాల్లో కేవలం రోడ్లుమాత్రమే వేసి కాల్వలు నిర్మించకపోవడంతో ఇళ్లల్లోని, వీధుల్లోని మురుగునీరు ఇళ్ల మధ్యే ఉండడంతో గ్రామాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మించుకోవడంతోనే..

కొత్త కాలనీలు ఏర్పాటు చేసే సమయంలో కాలనీలకు అనుమతులు లేక ఇష్టాను సారంగా నిర్మించుకోవడంతో ఈపరిస్థితి. అనుమతులు లేని నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఒకవేళ అనుమతులున్నా ఆ కాలనీల మురుగునీరు ఎక్కడికి తరలించాలన్న

చర్యలపై సాంకేతిక నిపుణు లు ముందస్తు ఆలోచ నలు చేయడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 40 యేళ్ల క్రితం ఏర్పాటైన పాణ్యంలోని అయ్యపు రెడ్డి కాలనీకి మురుగుకాల్వల నిర్మాణాలపై ప్రణాళి కలు లేక ఇప్పటికీ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. భూపనపాడు లోని బీసీ కాలనీలో కాల్వల నిర్మాణం చేపట్టక పోవడంతో పాటు మురుగునీరు ఎక్కడికి తరలించాలన్న ప్రయత్నాలపై అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. పాణ్యం బస్టాండు సమీపంలో జాతీయ రహదారుల శాఖ చేపట్టిన మురుగు కాల్వలు నిర్మాణ దశలోనే ఆగిపోవడంతో ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు. పలు మార్లు జిల్లా కలెక్టరుకు, ప్రజా ప్రతినిధులకు ప్రజలు తమ సమస్యను విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కాలనీ, కొత్తకొట్టాలలో మురుగు కాల్వలు లేక మురుగు ఇళ్ల మధ్యే దర్శనమిస్తుంది.

రూ. 43 లక్షలతో ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు పాణ్యం మండలంలో రూ.43 లక్షలతో 950 మీటర్లు మురుగుకాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు మంజూరు కాగా రూ.23 లక్షలతో 450 మీటర్ల మురుగు కాల్వల నిర్మాణం పూర్తిచేశారు. అత్యవసమైన చోట్ల కాల్వల నిర్మాణం పూర్తి చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మురుగు సమస్యతో తరలించిన గురుకుల పాఠశాల

ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాల భవనానికి సరైన మురుగు వ్యవస్థ లేక ఇటీవల పాఠశాలను నెరవాడ మినీ గురుకుల పాఠశాల భవనంలోకి మార్చారు. పదేళ్లుగా పాఠశాలలోని మురుగునీటిని బయటికి తరలించడంలో అధికారులు విఫలమయ్యారు. గత్యంతరం లేక 200 మంది విద్యార్థుల ను తరలించినట్లు సిబ్బంది పేర్కొన్నారు. మురుగు నీరు వెళ్లే ప్రభుత్వ రహదారి ఆక్రమణకు గురికావడంతో ఈపరిస్థితి వచ్చినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళికలతో..



పాణ్యం మండలంలో సరైన ప్రణాళికలు లేక మురుగు కాల్వల నిర్మాణాలు అస్తవ్యస్తంగా మారాయి. నూలుమిల్లు కాలనీలో మురుగునీరు నిలిచి దోమలకు నిలయంగా మారింది. పాఠశాల విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలు కాల్వల పూడిక తీయకపోవడంతో పాటు మురుగు నీరు తరలింపులో సరైన ప్రదేశాలను గుర్తించక పోవడంతో మురుగు సమస్య అధికమైంది.

- జగదీశ్‌బాబు, జనసేన కన్వీనర్, పాణ్యం

పలుమార్లు అధికారులకు...



బీసీ కాలనీ ఏర్పడి ముప్పయ్యేళ్లయినా ఇంత వరకు మురుగు కాల్వల నిర్మాణం చేపట్టలేదు. కొత్త కొట్టాలలో మురుగునీరు ఇళ్లల్లోకి చేరి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో కాలనీ ప్రజల అవస్థలు వర్ణణాతీతం, పలు మార్లు అధికారులకు విన్నవించినా ఫలితంలేదు.

● రాజశేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ఆత్మకూరురూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ రాము హెచ్చరించారు. ఆదివారం కృష్ణాపురం గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సర్చ్ నిర్వహించారు రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనుమానితుల వేలి ముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైజ్ ద్వారా పరిశీలించారు. సరైన ధృవ పత్రాలు లేని పది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్యవివాహాలు,మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. గ్రామంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు చేపడితే ప్రజలు డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సీఐ రాము ప్రజలను కోరారు.

బోధనకే పరిమితం చేయాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను ఇతర పనులకు కాకుండా కేవలం బోధనకే పరిమితం చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. నంద్యాల పీఆర్‌టీ యూ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కరుణానిధి, జిల్లా అధ్యక్షుడు రామపక్కీరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ కమీషన్ వెంటనే నియమించాలని కోరారు. ఉపాధ్యాయులకు అనవసర యాప్‌లను తొలగించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యా యులకు కూడా పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్‌చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు డీఎస్సీ ఉపాధ్యాయులను నియమించకముందే కౌన్సెలింగ్ ద్వారా కావాల్సిన ప్లేసులు కేటాయించాలని కోరారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారెడ్డి, సుధాకర్, సయ్యద్‌చాంద్ బాషా, భాస్కర్‌రెడ్డి, భార్గవరామయ్య కృష్ణారావు, చంద్రశేఖర్‌రెడ్డి, దేవనాల్‌శ్రీనివాసులు తదిదరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకుడు రామపక్కీరెడ్డి

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'


పాములపాడులో మాట్లాడుతున్న ధారా సుధీర్

పాములపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నందికొట్కూర్ ఇన్‌చార్జి ధారా సుధీర్ అన్నారు. ఆదివారం పాములపాడులో స్థానిక వైసీపీ నాయకులు మండల కన్వీనర్ టి.నాగరాజ్, కో ఆప్షన్ మెంబర్ ముర్తుజావలిలతో కలసి నాయకుల, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మోసపూరితమైన హామీలను ఇచ్చి ప్రజలను మోసగిస్తోందన్నారు.

కవి సమ్మేళనం

నంద్యాల కల్చరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆదివారం హైదరాబాద్ సిటీ కల్చర్ సెంటర్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాలకు చెందిన రచయిత కొప్పుల ప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నంద్యాలకు చెందిన పలు సాహితీసేవా సంస్థ సభ్యులు, కవులు, కళాకారులు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

మధ్యంతర భృతి చెల్లించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు 2023 నుంచి చెల్లించాల్సిన మధ్యంతర భృతిని వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాల ఏపీటీఎఫ్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటుచేయాలని, పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శివయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, .జాకీర్ హుస్సేన్, వీరేశ్వరరెడ్డి, హరినాథ్‌గౌడ్, రమాబాయి, తిమ్మారెడ్డి, నౌమాన్‌భాష, దస్తగిరిబాషా పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యదర్శిగా సంపత్

పాణ్యం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ పాణ్యం మండల కార్యదర్శిగా పొన్నపాటి సంపత్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకులు సుమియోన్ తెలిపారు. ఆదివారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాం పక్కిరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. పాణ్యం కార్యదర్శిగా సంపత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధిమూర్తి, కర్నూలు జిల్లా అధ్యక్షులు కృష్ణారెడిప్ప, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి ఉన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి స్వాగతం

నంద్యాల రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలా వీరాంజనేయస్వామి ఆదివారం రాత్రి నంద్యాలకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పుష్పగుచ్చం సమర్పించి స్వాగతం పలికారు. అనంతరం రాత్రికి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బస చేయన్నారు. సోమవారం కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొననున్నారు.


మొక్క ఇస్తున్న మంత్రి ఫరూక్

వ్యక్తి దారుణ హత్య

పాణ్యం, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక డొంగు సమీపంలో గోరుకలు రహదారిలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఘటనా ప్రాంతాన్ని ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్‌తో పాటు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్‌రెడ్డి పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. నంద్యాలకు చెందిన పరుచూరి అశోక్‌కుమార్ (37) పాణ్యానికి చెందిన మునుగు సుబ్బయ్యకు రూ.40 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఇచ్చిన డబ్బులు వసూలు చేసుకునేందుకు పాణ్యానికి వచ్చిన అశోక్ కుమార్, సుబ్బయ్య మధ్య వాగ్వాదం జరిగింది. సుబ్బయ్య కుమారుడు సురేంద్ర, సలకాపురం రమేష్ కలిసి కత్తితో దాడి చేయడంతో అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. హంతకులు పోలీసు స్టేషన్‌లో లొంగిపోయారు. అశోక్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్యాలయాల ఏర్పాటుకు భవనాల పరిశీలన


భవనాలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

ఆత్మకూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో పలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి పరిశీలించారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడటంతో ఇక్కడ డీఎల్‌డీవో, డీఎల్‌పీవో, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ ఏపీడీ కార్యాలయాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. మూడు కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. ఇందుకోసం సుమారు 2500 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరం కావాల్సి ఉండగా ఆ భవనాల ఏర్పాటుకు సంబంధించి స్థానిక ఎంపీడీవో కార్యాలయంతో పాటు కరివేన సమీపంలోని పట్టుసంవర్ధకశాఖ భవనాలను పరిశీలించారు. అయితే ఎంపీడీవో కార్యాలయంలోని భవనాలు ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనుకూలంగా లేకపోవడంతో పట్టుసంవర్ధకశాఖకు చెందిన భవనాల్లోని మొదటి అంతస్తులో ఆయా కార్యాలయాలను ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనాలు కొంతమేర దెబ్బతినడంతో వాటి మరమ్మతులకు కావాల్సిన ప్రతిపాదనలను తయారు చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ సుబ్బయ్యను జడ్పీ సీఈవో ఆదేశించారు. ఆత్మకూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినోద్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రంలో ప్రజా పాలన

నంద్యాల రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తోందని, ఈ ప్రభుత్వంతోనే సుపరి పాలన ఉంటుందని టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోన్నాపురం కాలనీలో 19వ వార్డులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎండీ ఫయాజ్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ టీడీపీ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అందుతు న్నాయని తెలిపారు. అనంతరం స్థానిక వార్డులో ఇంటింటికి తిరిగి పథకాలు వివరించారు. సమస్యలు తెలుసుకుని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్ మరమ్మతులను గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. టీడీపీ నాయకులు జనార్దన్, మహబూబ్‌బాష, నాయకులు పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న ఎన్ఎండీ ఫయాజ్

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- కాంగ్రెస్ పార్టీ మహానంది మండల అధ్యక్షుడు షంషీర్ బాషా


గాజులపల్లెలో బురదను చూపుతున్న నాయకుడు

మహానంది, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారిందని కాంగ్రెస్ పార్టీ మహానంది మండల అధ్యక్షుడు షంషీర్ బాషా అన్నారు. ఆదివారం మండలంలోని గాజులపల్లి గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ కాల్వలను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ అపరిశుభ్రత నెలకొందన్నారు. రూ.లక్షలాదితో సీసీ రోడ్లు నిర్మించినప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అటు అధికారపార్టీకి చెందిన నాయకులు గాని అధికారులు కూడా చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. దీనివల్ల ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ నిర్వహించే స్వచ్ఛంధ్ర కార్యక్రమం కేవలం అధికారులు, ప్రజా ప్రతినిధుల ఫొటోలకే పరిమితం అయిందన్నారు.

పుస్తకం ఆవిష్కరణ

మహానంది, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కామేశ్వరీదేవి అమ్మవారి వ్రతకల్ప పూజా విధానం, అమ్మవారి వైభవాన్ని తెలియ చేసే పుస్తకాన్ని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతుల కుమార్తెలు తంగిరాల హరికృష్ణ, కామేశ్వరీ కమలదేవిలు తమ కులదైవమైన కామేశ్వరీ అమ్మవారి వ్రతకల్పము, పూజా విధానముతో పాటు మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి వైభవాన్ని తెలియపరిచే విధంగా పుస్తకాన్ని ముద్రించారు. అమ్మవారి పాదాల వద్ద పుస్తకాలను ఉంచి వేదపండితులు, అర్చకులు పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర్ అవధాని, పుస్తకదాతలు పాల్గొన్నారు.

కుక్కదాడి.. చిన్నారికి గాయాలు

పాములపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానుముక్కల గ్రామంలో జయమ్మ అనే చిన్నారిపై కుక్కదాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఆదివారం గ్రామంలోని గడ్డం బాలరాజు కుమార్తె జయమ్మ ఇంటిముందు ఆడుకుం టుండగా కుక్కదాడి చేసింది. తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

ఆత్మకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల మధ్య నెలకొన్న చిన్నపాటి మనస్పర్థల కారణంగా కొత్తపల్లి మండలం గువ్వలకుంట్లకి చెందిన రాజేష్ అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికి త్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నందికొట్కూరుకి చెందిన బోరెల్లి రాజేష్ తన భార్య స్వగ్రామమైన కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల నివాసం ఉంటున్నాడు. ఇక్కడే ఆటో నడుపుకొంటూ జీవనం సాగించేవాడు. ఆర్థిక సమస్యలు తలెత్తాయి. ఒత్తిడి తట్టుకోలేక మనస్థాపా నికి గురై శనివారం మధ్యాహ్నం పురుగుల మందుతాగి పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. విష యం తెలుసుకున్న పోలీసులు ఆయన్ని వెంటనే ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి విష మంగా ఉండటంతో కర్నూలుకు రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చె దారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణరెడ్డి వెల్లడించారు.

విద్యుత్ సిబ్బందిపై దాడి

మహానంది, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామంలో విద్యుత్ శాఖ సిబ్బందిపై దాడి చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం తెలి పారు. శనివారం రాత్రి గ్రామంలో విద్యుత్ సమస్య రావడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మ రమ్మతులు చేస్తుండగా గ్రామానికి చెందిన బాల నడిపి మద్దిలేటి, మధు క్రిష్ణ, లైన్‌మె న్ వేణుగోపాల్, రవిబాబులను విధులను అడ్డుకొని దాడిచేసినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వేలం వాయిదా

నంద్యాల కల్చరల్, జూలై 20 (ఆంధ్ర జ్యోతి): మూలమఠం భీమేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని ఏసీ కల్యాణ మండపము లీజు వేలంను వాయిదా వేసినట్లు ఈవో వేణునాథరెడ్డి ఆదివారం తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని పేర్కొన్నారు. తదుపరి వేలం తేదీని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో ప్రకటిస్తామన్నారు.

నేడు దుద్యాలకు మంత్రి

కొత్తపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సోమవారం రాను న్నట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. ఆది వారం ఆమె మాట్లాడుతూ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, స్థానిక ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి రానున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'తొలి అడుగు'లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం కొత్తపల్లి నాగంపల్లి వ్యవసాయ సహకార సంఘం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంలో కూడా పాల్గొనే అవకాశం ఉంది.

ఆర్యవైశ్యుల హర్షం

నంద్యాల కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం అమరావతిలో శాఖమూరి పార్కులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించడంతో నంద్యాల ఆర్యవైశ్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నంద్యాల సంజీవనగర్ కూడలిలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయిడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రులు లోకేష్, ఫరూక్, టీజీ భరత్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్, ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం గౌరవాధ్యక్షుడు కండే శ్యామ్ సుందర్‌లాల్, భవనాశి నాగే మహేష్, సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సీపీఐ ఎంఎల్ అభినందనలు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నందికొట్కూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతంగా ఉన్న మిడ్తూరు మండలానికి హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడంపై సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నాటి మిడ్తూరు ఎత్తిపోతల పథకం కలను నెరవేర్చుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడంతో రైతుల్లో ఆనందం కలుగుతోందన్నారు. ఈ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని ఎన్నో పోరాటాలు చేశామన్నారు. నేటికి ప్రభుత్వంలో చైతన్యం వచ్చి ఈ పథకం అమలుకు ముందడుగు వేయడం సంతోషించదగ్గ విషయ మన్నారు. త్వరలో ఆర్థికశాఖ క్లియరెన్స్ చేసి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ నాయకులు ఎస్‌బీటీ మూర్తిజాబి నాయకులు సామన్న, సుధాకర్ పాల్గొన్నారు.


ఓటు వేస్తున్న మహిళలు

హోరాహోరీగా ఎన్నికలు

నంద్యాల కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హోలీక్రాస్ కెథడ్రిల్ చర్చి పాస్టరేట్ కమిటీ ఎన్నికలు హోరా హోరీగా ఆదివారం నంద్యాల రైడర్ మెమోరియల్ హాలులో జరిగాయి. ఈ ఎన్నికల్లో గుడ్‌సెఫర్డ్ ప్యానెల్, ప్రభుదాస్ ప్యానెల్, డేవిడ్ కింగ్‌డమ్ ప్యానెల్ సభ్యులు పాల్గొన్నారు. ఈ మూడు ప్యానెల్స్ నుంచి జనరల్ అభ్యర్థులుగా 40 సభ్యులకుగాను 14మంది, రిజర్వ్‌డ్ ఉమెన్స్‌గా 15మంది సభ్యులుకు గాను ఏడుగురు, యూత్ కమిటీకి 14 మంది సభ్యులకు గాను ఏడుగురు సభ్యులను ఎన్నుకుంటారన్నారు. ఈ ఎన్నికలు పూర్తి అయిన తర్వాత పాస్టరేట్ కమిటీ ఏర్పాటుచేసి చర్చి అభివృద్ధికి కమిటీ తోడ్పడుతుందన్నారు. మొత్తం 1870 మంది ఓటర్లకు గాను 1657 మంది తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నట్లు ఎన్నికల అధికారి రెవరెండ్ జోషఫ్ తెలిపారు

భక్తి శ్రద్ధలతో సారె సమర్పణ


సారె ఊరేగింపుగా తెస్తున్న మహిళలు

నంద్యాల కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా జగజ్జననీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి చీరెసారె సమర్పించారు. జగజ్జననీ ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు,వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అమ్మవారి ప్రతిమను అలంకరించి పుట్టింటి పట్టుచీర, సారెను తీసుకొని వచ్చి సాంప్రదాయల నృత్యాలతో వచ్చి చీర,సారెను సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

'తొలి అడుగు'కు స్పందన

గోస్పాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్ర మానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తులసీశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం పసురపాడు, జూలేపల్లె, కానాలపల్లె, తేళ్లపురి, ఒంటివెలగల, గోస్పాడు తదితర గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లికివందనం, ఉచిత విద్యుత్, రేషన్, గ్యాస్ సిలిండర్లు వస్తున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అంగ లింగమయ్య, బూత్ కన్వీనర్లు మనోహర్‌రెడ్డి, భాస్కర్, పేరయ్య చౌదరి పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతాం

నంద్యాల కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని నంద్యాల బ్రాంచ్ అధ్యక్షుడు ఖండే ఆనంద్ గురూజీ అన్నారు. ఆదివారం పీఎంఆర్ కళాశాలలో భారత్ వికాస్ పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. భారత వికాస రత్నం బాలచంద్రుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నంద్యాల బ్రాంచి అధ్యక్షుడుగా ఖండే ఆనంద్ గురూజీ, ఉపాధ్యక్షులుగా వంకదార గోపాలకృష్ణను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి రథోత్సవం


సత్యసాయి రథయాత్రలో పాల్గొన్న పండితులు, మహిళలు

చాగలమర్రి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో సత్యసాయి ప్రేమప్రవాహిని రథయాత్ర గ్రామోత్సవం వేద పండితులు పెద్దశాస్త్రీ, సత్యసాయి భక్తులు, మహిళల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అంతకముందు సాయిమందిరంలో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ముత్యాలపాడు, అహోబిలం, కోవెలకుంట్ల ప్రాంతాలలో రథయాత్ర జరుగుతుందని సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు రాంపుల్లయ్య పేర్కొన్నారు. భక్తులు రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి సేవకులు చంద్రమౌళి, రవికుమార్, హరికృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు


మధు దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

రుద్రవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామిని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మానస లింగేశ్వరస్వామి, త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులు మధుసూదనరెడ్డి, రంగనాయకులు, నరసింహులు ఉన్నారు.

ఏడాది పాలనలో ప్రజలు సంతృప్తి

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ


కరపత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ప్రభుత్వంలో ఏడాది పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని 4వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో సుపరి పాలన అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్య మన్నారు. ప్రభుత్వానికి అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య దర్శి కోట్రికె ఫణిరాజ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్, ఓబులాపురం శేషిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషణ్, పీఏసీఎస్ చైర్మన్ చిన్నపూజర్ల ఎల్లాగౌడు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడు, మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్ సుదీష్, టీఈ రాఘవేంద్రగౌడు, చిట్యాల మద్దయ్యగౌడు, చనుగొండ్ల శ్రీరాములు, హరి, ఐటీఐ రాముడు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలతో పేదల్లో ఆనందం

డోన్ రూరల్: కూటమి ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలతో ప్రజల్లో ఆనందం నెలకొందని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ శీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఆదివారం గ్రామంలో డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్ నాయుడుతో కలిసి సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని మల్లెం వీధిలో ఏడాది సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అన్నారు. సూపర్-6 పథకాల అమలు తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బీసీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించకుంటే చంపేస్తానని బెదిరింపు

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

కొలిమిగుండ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన సొమ్మును తిరిగి చెల్లించకుంటే చంపేస్తానని అప్పుదారుడు బెదిరించడటంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. అంకిరెడ్డిపల్లె గ్రామానికి మల్లికార్జునరెడ్డి తాడిపత్రికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి వద్ద అధికవడ్డీకి అప్పు తీసుకున్నాడు. మల్లికార్జునరెడ్డి వడ్డీ చెల్లించకపోవడంతో అనిల్‌కుమార్‌రెడ్డి చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెర్లోపల్లెలో చోరీ

అవుకు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో సాలె వెంకటేశ్వర్లు ఇంట్లో ఆదివారం చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి వెంకటేశ్వర్లు కుటుంబం ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్సకోసం ఈనెల 17వ తేదీన నంద్యాలకు వెళ్లారు. నాలుగు రోజుల తర్వాత వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడిఉన్నాయి. రూ.50వేలు నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులకు విషయం తెలపగా ఇంటి వద్దకు వచ్చి చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

'మైనార్టీల ఇళ్లను కూల్చడం ఆపాలి'

ఆళ్లగడ్డ, జూలై 20(ఆంధ్రజ్యోతి) : అస్సాంలోని మైనార్టీల ఇళ్లను బీజేపీ ప్రభుత్వం కూల్చివేయడాన్ని వెంటనే ఆపాలని ఎస్‌డీపీఐ నంద్యాల జిల్లా కమిటీ మెంబర్ జాఫర్ డిమాండ్ చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు ముక్తార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ మైనార్టీలను హింసిస్తోందని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఫక్రుద్దీన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంషుల్ హక్, జేఏసీ ప్రధాన కార్యదర్శి బీరువాల బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో పోలీసుల సాయాన్ని పొందాలి

● డోన్ రూరల్ ఎస్ఐ మమత


విద్యార్థినులద్దేశించి మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ మమత

డోన్ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లలు, మహిళలు ఏదైనా ఆపదలో ఉంటే తక్షణమే పోలీసుల సహాయాన్ని పొందాలని డోన్ రూరల్ ఎస్ఐ మమత కోరారు. ఆదివారం పట్టణంలోని బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో శక్తి టీం ఆధ్వర్యంలో మహిళలకు, బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు డోన్ శక్తి టీం సబ్ ఇన్స్‌పెక్టర్ మమత విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికల సంరక్షణ చట్టం, ఈవ్ టీజింగ్, రహదారి భద్రత నియమాలు, సైబర్ క్రైం వాటిపై అవగాహన ఇచ్చారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా వెంకట్రాముడు


మాట్లాడుతున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కేశవరెడ్డి

కోవెలకుంట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ కోవెలకుంట్ల అధ్యక్షుడిగా కె.వెంకట్రాముడు, సెక్రటరీగా సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నరు కేశవరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్కంధ కమ్యూనిటీ హాల్‌లో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. సమావేశంలో హరీష్ బాబు, రవికుమార్, మాజీ ప్రెసిడెంటు శ్రీనివాసులు, సూర్య నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, బాలాంజనేయరెడ్డి, మోహన్ మూర్తి, అబ్దుల్‌సత్తార్, శేషారెడ్డి, వెంకటసుబ్బయ్య, వీరభద్ర శివ, దస్తగిరి, జగదీశ్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు


మండల టాపర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో, అపూస్మ సభ్యులు

చాగలమర్రి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో న్యామతుల్ల, ఆళ్లగడ్డ అపూస్మ తాలుకా అధ్యక్షుడు అమీర్‌బాష తెలిపారు. ఆదివారం చాగలమర్రి చైతన్యభారతి ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరంలో పదోతరగతిలో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన అంబికశ్రీ (584), కనిష్‌తేజ (579)లను సన్మాంచారు. కార్యక్రమంలో అపూస్మ కార్యదర్శి జబ్బర్, పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, ఏవో చంద్రకళ, శారద, చంద్రమౌళి, హెచ్ఎం రఫి, విశ్రాంత ఏఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మినుములు, కంది విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల, జూలై 20 (ఆంధజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ప్రభుత్వం అందించే మినుములు, కంది విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్, ఏఈవో నాగరాజు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద ప్రభుత్వం మినుములు, కంది విత్తనాలు అందజేస్తోందని తెలిపారు. ఆయా పంటలను సాగుచేసే ఆసక్తి కలిగిన రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

మండలంలో 25.2 మి.మీ. వర్షపాతం

కొలిమిగుండ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో గడచిన 24గంటల్లో 25.2మీ.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్‌వో భాస్కర రెడ్డి ఆదివారం వెల్లడించారు. మండలంలోని ఇటిక్యాల, మధనంతపురం, కోటపాడు, ఎర్రగుడి తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా, కొలిమిగుండ్ల, బెలుం, పెట్నీకోట, మీర్జాపురం, బెలుంశింగవరం తదితర గ్రామాల్లో మరింత తక్కువ వర్షం కురిసినట్లు అన్నదాతలు పేర్కొన్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు కాస్త ఊరట కలిగిస్తున్నాయన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి

చాగలమర్రి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా బేస్‌బాల్ సంఘ చైర్మన్ షేక్.బాబులాల్, చక్రం షబ్బీర్ పేర్కొన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని వైసీపీ కార్యాలయంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో విజేతలైన నంద్యాల జిల్లా క్రీడాకారుల అభినందన సభ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, లీగల్ సలహాదారుడు మాధవరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో నంద్యాల జిల్లా జట్టు అత్యంత ప్రతిభకనబరిచి బంగారు పతకాలు సాధించారన్నారు. క్రీడాకారులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శులు రమణయ్య, సుబ్బయ్య, వివిధ జిల్లాల కార్యదర్శులు, జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు నాగేంద్ర, షేక్షావలి, నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

శిరివెళ్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ చిన్న పీరయ్య హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా మండలంలోని వనికెందిన్నెలో ఆదివారం తెల్లవారుజామున అనుమానిత వ్యక్తుల నివాసాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. తనిఖీల్లో ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కొలిమిగుండ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు సూచించారు. సీఐ ఆధ్వర్యంలో వాహనా తనిఖీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడుపరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి, ప్రమాదాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు.

కార్యకర్తను పరామర్శించిన రాజారెడ్డి


వివరాలు తెలుసుకుంటున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూలై 20(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని బీసీ గుర్రెడ్డి కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త విజయభాస్కర్‌రెడ్డిని ఆదివారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పరామర్శించారు. విజయభాస్కర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నంద్యాల ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను రాజారెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రంలో డాక్టర్ రాఘవ, వార్డు సభ్యుడు అల్తాఫ్‌హుసేన్, గోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం


ప్యాపిలిలో పీర్లకు పూజలు చేస్తున్న భక్తులు

ప్యాపిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం మొహర్రాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. బందేనవాజ్, దస్తగిరిస్వామి, చిన్నగుడంరాళ్ల స్వామి పీర్ల దగ్గర చదివింపుల కోసం భక్తులు బారులు తీరారు. అలాగే యువకులు గుండం చుట్టూ చిందులు తొక్కుతూ సందడి చేశారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ మధుసూదన్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

పీర్లకు కోట్ల సుజాతమ్మ పూజలు

పట్టణంలో నిర్వహించిన మొహర్రంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె బందేనవాజ్ పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట పలువురి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముచ్చలపురి గ్రామంలో...

సంజామల : మండలంలోని ముచ్చలపురి గ్రామంలో ఆదివారం జియారత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కొలువైన మలాఅలీ స్వామి పీర్లకు ప్రత్యేక ఫతేమాలు సమర్పించి జాతర వేడుకల్లో ప్రజలు పాల్గొన్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో స్వామివారి పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. చావిడి వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కలచట్లలో చిరుత సంచారం

ప్యాపిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలచట్ల గ్రామంలోని రంగస్వామి కొండ ప్రాంతంలో నాలుగు రోజులుగా చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మేతకు వెళ్లిన గొర్రెలపై దాడి చేసినట్లు చెప్పారు. అటవీశాఖ అధికారులకు చిరుత సంచారంపై సమాచారం ఇవ్వడంతో వారు కొండ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. రంగస్వామి కొండవైపు వెళ్లవద్దని అధికారులు గ్రామంలో దండోరా వేయించారు. చిరుత సంచారంతో కలచట్ల గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.

బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీసీ జేఆర్ వెల్ఫేర్ ట్రస్టు తరుపున భవన నిర్మాణ కార్మికుడు సయ్యద్ సజ్జాద్ హుసేనికి రూ.15వేలు ఆర్థిక సాయాన్ని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం అందజేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా బాధితుడు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.లక్ష విరాళం

రుద్రవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపం నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని శిరివెళ్ల గ్రామానికి చెందిన ఉల్లినాగేశ్ దంపతులు ఆదివారం అందించారు. ఈ విరాళాన్ని ఆలయకమిటీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్‌వీ రంగనాయకులు కార్యదర్శి నరసింహులుకు అందించారు. కల్యాణమండపం నిర్మాణానికి విరాళం అందించడం సంతోషంగా ఉందని దాతలు అన్నారు.

బలిజ సంఘం కార్యవర్గం ఎన్నిక


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న బలిజ కులస్తులు

ఉయ్యాలవాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న బలిజ కులస్తులు ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కమతం చిన్నరాముడు, అధ్యక్షుడిగా ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా ఆవుల శ్రీనివాసులు, కార్యదర్శిగా నగిరి శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా మైలారు హేమంత్‌కుమార్, ట్రెజరర్ గా కమతం విష్ణు, సలహదారుడిగా బండ్రోత్తు లక్ష్మీకాంత్, కార్యవర్గ సభ్యులుగా పులివెందుల నరసింహుడు, గవాజి రమణయ్య, మరళిలను ఎన్నుకున్నారు. మండల బలిజ కులస్తుల ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం ఇస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య ప్రకటించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్న సుబ్బయ్య, అర్జిగారి నరసింహుడు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి

డోన్ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయ ప్రాంగణంలో డోన్ పట్టణ, మండల నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ శ్రీరాములు, పార్టీ జిల్లా వలంటరీ విభాగపు అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, జిల్లా నాయకులు కురుకుంద హరి, సోమేష్ యాదవ్, రామచంద్రుడు, మల్లికార్జునరెడ్డి, కళ్యాణి, దినేష్‌గౌడు పాల్గొన్నారు.

ప్యాపిలి: ఎన్నికల హామీలను నెరవేర్చాలని వైసీపీ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, న్యాయవాది నాగభూషనం రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బూరుగుల శ్యాంసుందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి, రాజా మురళి, చిన్నసుంకయ్య, రజనిరెడ్డి, బోరెడ్డి రాము, బషీర్, తులసిరెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని వైసీపీ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ పార్టీ కార్యాలయంలో బేతంచర్ల పట్టణ, మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ చలంరెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, బాబురెడ్డి, ముర్తుజావలి, ఖాజా హుశేన్, గూని నాగరాజు, సీతారామచంద్రుడు పాల్గొన్నారు.

సంజామల : టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తామన్న సూపర్ సిక్స్ పథకాల అమలులో విఫల మైందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. ఆదివారం గిద్దలూరు ఫంక్షన్ హాల్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నాయకులు పోచా వెంకటరామిరెడ్డి, బత్తుల రామచంద్రారెడ్డి, చిన్నబాబు, ముచ్చలపురి దొర, గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, ముదిగేడు రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీబాబు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ముత్యాలతో అలంకరణ



ప్యాపిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం పూజల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వాసవీమాతను భక్తులు ముత్యాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పట్టణంలోని ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాకంబరిగా పెద్దమ్మ దేవత


పెద్దమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం వీధిలో వెలసిన పెద్దమ్మ దేవత శాకంబరిగా ఆదివారం కొలువుదీరారు. సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా చీర, సారె సమర్పించి అమ్మవారిని పండ్లు, పూలు, కూరగాయలతో అలంకరింప చేసి శాకంబరిగా కొలువుదీర్చారు. వరుణ దేవుడు కరుణించాలంటూ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు రామతీర్థం, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, మహిళలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం : మండలంలోని యల్లావత్తుల, చిన్నకంబలూరు, కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మారెమ్మ, పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు పూజలు చేశారు. మహిళలు గ్రామ దేవతలకు చీరలు, బోనాలు సమర్పించారు. గ్రామదేవతలను పూజిస్తే పాడిపంట చల్లగా ఉంటాయని మహిళలు నమ్మకం వ్యక్తం చేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


రామాంజినేయులు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సుబ్బారెడ్డి

ప్యాపిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలచట్ల గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు రామాంజినేయులు (45) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ సీడ్స్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ వేర్వేరుగా వచ్చి రామాంజినేయులు మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలసి ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కలచట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి'

బేతంచెర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయ్, దస్తగిరి, నాగరాజు, సోమన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ మృతికి సంతాపం

డోన్ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో లారీ డ్రైవర్ సిద్ధారెడ్డి (55) గుండెపోటుతో మరణించాడు. ఆయన మృతి విషయం తెలుసుకున్న డోన్ టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి సిద్ధార్థరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హుశేన్‌పీరా, నూర్ బాషా, ఈశ్వరయ్య ఉన్నారు.